

వరంగల్ కోర్టు ఎదుట నిరసనలో పాల్గొన్న న్యాయవాదులు

## కళాతోరణం తొలగిస్తే మరో ఉద్యమం

**వరంగల్ కోర్టు ఎదుట న్యాయవాదుల నిరసన**

వరంగల్ లీగల్, మే 31: ప్రపంచం మెచ్చిన కాకతీయ కళాతోరణం గౌరవాన్ని దిగజార్చే విధంగా వ్యవహరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు మాతంగి రమేశ్‌బాబు హెచ్చరించారు. అధికార చిహ్నం నుంచి కాకతీయ కళాతోరణాన్ని, చార్మినార్‌ను తొలగించడాన్ని ఓరుగల్లు బిడ్డలుగా జీర్ణించుకోలేక పోతున్నామని చెప్పారు. ఒకవేళ నిర్ణయాన్ని ఉపసంహరించుకోక పోతే మరోసారి న్యాయవాదులందరమూ ఒక్కగొంతుతో ఉద్యమిస్తామని హెచ్చరించారు. శుక్రవారం వరంగల్ కోర్టు ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాదులు ముద్దసాని సహోదర్‌రెడ్డి, మహేంద్ర ప్రసాద్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు తాళ్లపల్లి జనార్దన్‌గౌడ్, బీఆర్‌ఎస్ లీగల్ సెల్ అధ్యక్షుడు వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల మేధావులు, రాజకీయ నాయకులను సంప్రదించిన తర్వాతే రాజముద్రను ఆమోదించాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు శ్యామ్‌సుందర్‌రావు, సంసాని సునీల్, అబ్దుల్‌నబీ, శివరాజు, వసంత్ యాదవ్, మహేశ్‌పటేల్, కిరణ్ కుమార్, రాము తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ బిడ్డలను చంపిన బలిదేవత ఎవరు?

- **వేలాది మంది అమరులైంది ఎవరివల్ల?**
- **ఎవరివల్ల అమరుల స్థూపం కట్టినం?**
- **బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నలు**

హైదరాబాద్, మే 31 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి రాష్ట్రం వద్దని, హైదరాబాద్ స్టేట్ ప్రత్యేకంగా ఉండాలని 1952లో పోరాటం చేస్తున్న విద్యార్థులపై సిటీ కాలేజీ వద్ద కాల్పులు జరిపి ఆరుగురిని బలిగొన్నది ఎవరు? 1969-71 తొలిదశ ఉద్యమంలో 370మంది తెలంగాణ బిడ్డలను కాల్చి చంపింది, 1971 పార్లమెంట్ ఎన్నికల్లో 11/14 సీట్లలో తెలంగాణ ప్రజాసమితి గెలిస్తే ఆ పార్టీని మాయం చేసిందెవరు? అంటూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. కాంగ్రెస్ వల్లే తెలంగాణలో వేలాది మంది అమరులయ్యారని, అమరుల స్థూపం కట్టాల్సి వచ్చిందని విమర్శించారు. ప్రజాస్వామ్యయుతంగా ఆకాంక్షను వ్యక్తం చేస్తే తెలంగాణను తుంగలో తొక్కింది, 2004లో మాట ఇచ్చి, పదేండ్లు తాత్సారం చేసి వందలాది మంది తెలంగాణ బిడ్డల ఆత్మబలిదానానికి కారణమైంది ఎవరు? అంటూ నిలదీశారు. రేవంత్‌రెడ్డి స్వయంగా చెప్పినట్టు, వేలాది మంది తెలంగాణ బిడ్డలను చంపిన బలిదేవత ఎవరు? అంటూ కేటీఆర్ ప్రశ్నల వర్షం కురిపించారు.

## దశాబ్ది వేడుకలకు కేసీఆర్‌ను ఆహ్వానించాం

**ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ వెల్లడి**

హైదరాబాద్, మే 31 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలకు బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుడు కే చంద్రశేఖర్‌రావును ఆహ్వానించినట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రొటోకాల్ సలహాదారు హర్కర వేణుగోపాల్ చెప్పారు. బంజారాహిల్స్ నందినగర్‌లోని కేసీఆర్ ఇంటికి శుక్రవారం సాయంత్రం హర్కర వెళ్లి ఆహ్వానించారు. అనంతరం అక్కడ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశానుసారం ప్రొటోకాల్ డైరెక్టర్ అర్విందర్‌సింగ్, డిప్యూటీ డైరెక్టర్ భేగ్‌తో కలిసి కేసీఆర్‌కు ఆహ్వానపత్రాన్ని అందజేసినట్టు చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగస్వాములైన అందరినీ ఈ ఉత్సవాలకు ఆహ్వానిస్తున్నామని వేణుగోపాల్ తెలిపారు.

## రాజముద్రను మార్చి తీరుతం

**కాంగ్రెస్ నేతలు మహేశ్‌కుమార్, మల్లు రవి, బెల్లయ్యనాయక్**

హైదరాబాద్, మే 31 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర చిహ్నం మార్పుపై వెనక్కి తగ్గబోమని, మార్చి తీరుతామని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ స్పష్టంచేశారు. రాష్ట్ర చిహ్నంలో అమరుల స్థూపం ఉంటే బీఆర్‌ఎస్ నాయకులకు నష్టమేమిటని ప్రశ్నించారు. గాంధీభవన్‌లో గురువారం పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి, అధికార ప్రతినిధి భవానీరెడ్డి, బెల్లయ్యనాయక్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. అతి త్వరలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర చిహ్నం తీసుకొస్తామని చెప్పారు. చిహ్నంలో అమరవీరుల స్థూపం ఎందుకు పెట్టకూడదని ప్రశ్నించారు. అమరుల వల్లే తెలంగాణ వచ్చింది వాస్తవం కాదా?.. దీనిపై ఎందుకు నానా యాగీ చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణవాదులు, ఉద్యమకారులు, కవులు, కళాకారులు ఏ విధంగా కోరుకుంటున్నారో ఆ విధంగా ముందుకు వెళ్తామని తెలిపారు.

# చరిత్రను చెరిపితే సహించం

- **కళాతోరణం రాచరికం కాదు... రాజసం**
- **కేసులకు అదరం.. అరెస్టులకు బెదరం**
- **విరమించే వరకు పోరాటం విడిచేది లేదు**
- **హనుమకొండ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు దాస్యం**
- **వరంగల్‌లో మానవహారంతో నిరసన**



హనుమకొండలోని కాళోజీ సెంటర్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీ సారయ్య, టార్చ్ ప్రతినిధులు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు

వరంగల్, మే 31 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): తెలంగాణ రాజముద్ర నుంచి కాకతీయ కళాతోరణం తొలగించే నిర్ణయాన్ని వాయిదా వేయడం కాదని, తప్పకుండా విరమించుకోవాల్సిందేనని వరంగల్ నగర ప్రజలు తేల్చి చెప్పారు. ఆ ప్రతిపాదనను పూర్తిగా విరమించే వరకు ఊరుకునే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. కాకతీయ కళాతోరణాన్ని రాజముద్ర నుంచి తొలగించాలనే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ టీం ఆఫ్ రీసెర్చ్ ఆన్ కల్చర్ అండ్ హెరిటేజ్ (టార్చ్) ఫౌండేషన్, బీఆర్‌ఎస్ సంయుక్తంగా వరంగల్‌లోని కాళోజీ జంక్షన్‌లో శుక్రవారం నిర్వహించిన మానవహారంలో ప్రజలు పాల్గొని నిరసన తెలిపారు. కాళోజీ విగ్రహానికి పూలమాల వేసి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాకతీయ కళాతోరణం రాచరికం గుర్తు కాదని, అది ఉమ్మడి వరంగల్ జిల్లా రాజసం అని బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ చెప్పారు. వెయ్యేండ్ల సాంస్కృతిక, వారసత్వ సంపదకు కళాతోరణం ఒక సాక్ష్యం అని తెలిపారు. కాకతీయ చరిత్రను చెరిపివేయాలని చూస్తే సహించబోమని హెచ్చరించారు. కాకతీయ కళాతోరణం రాచరికానికి గుర్తు అన్న సీఎం రేవంత్‌రెడ్డి అజ్ఞానానికి చింతిస్తున్నామన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని, చరిత్రపై అవగాహన లేని వ్యక్తి తెలంగాణ, ఓరుగల్లు చరిత్రను చెరిపివేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలపై పోరాడుతుంటే కేసులు పెడుతున్నారని అన్నారు. కేసులకు అదరం బెదరం అని పేర్కొన్నారు. చరిత్ర గుర్తులను తొలగిస్తుంటే వరంగల్ జిల్లా మంత్రులు వ్యతిరేకించకపోవడం సిగ్గుచేటన్నారు. మంత్రులు సురేఖ, సీతక్క దీనిపై స్పందించాలని కోరారు.

### ఆనాలోచిత నిర్ణయంపై పునరాలోచించాలి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాకతీయ కళాతోరణం తీసివేసే అనాలోచిత నిర్ణయాన్ని పునరాలోచించాలని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య సూచించారు. కాకతీయుల చరిత్ర, విశిష్టతను గుర్తించే కళాతోరణాన్ని రాజముద్రంలో పెట్టారని చెప్పారు. రాజముద్ర నుంచి కాకతీయ కళాతోరణం తొలగిస్తే తీవ్రస్థాయిలో ఉద్యమిస్తామని పేర్కొన్నారు. కాళోజీ ధిక్కార స్వరాన్ని చూపిస్తామని చెప్పారు. ఆందోళనలో టార్చ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అరవింద్ ఆర్య, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, కార్పొరేటర్లు బొంగు అశోక్ యాదవ్, సోదా కిరణ్, రంజిత్‌రావు, సంకు నర్సింగ్, ఇమ్మడి రాజు లోహిత, రాజునాయక్, బీఆర్‌ఎస్ పశ్చిమ నియోజకవర్గం కోఆర్డినేటర్ పులి రజనీకాంత్ పాల్గొన్నారు.

### అవి సాంస్కృతిక వారసత్వాలు



'వేల ఏండ్ల క్రితం రాజుల పాలనలో నిర్మించిన కట్టడాలను రాచరికపు ఆనవాళ్లుగా గుర్తించలేం. వాటిని ముమ్మాటికీ సాంస్కృతిక వారసత్వాలుగానే చూస్తాం. వరంగల్లులో కాకతీయ తోరణాలను తోరణ ద్వారాలని, హంస ద్వారాలని, కీర్తి తోరణాలని చరిత్రకారులు రాశారు. ప్లేగు వ్యాధి తగ్గేందుక ప్రార్థించిన స్థలంలోనే మహమ్మద్ కులీ కుతుబ్ షా చార్మినార్ నిర్మించాడు. అప్పటి కట్టడాలను సాంస్కృతిక సందపగానే గుర్తించాలి తప్ప, రాచరికపు ఆనవాళ్లుగా చూడటం సబబు కాదు.

— **శ్రీరామోజు హరగోపాల్, కొత్త తెలంగాణ చరిత్ర పరిశోధకుడు,**

### కాకతీయ తోరణం, చార్మినార్ తొలగింపు అవివేకం



రాష్ట్ర రాజముద్ర నుంచి కాకతీయ తోరణం, చార్మినార్‌ను తొలగించాలనుకోవడం అవివేకం. ఇప్పటికిప్పుడు ఎందుకు రాజముద్రను మార్చాల్సి వచ్చింది. ప్రజలు పరిపాలన చేయాలని అధికారం చేతికి ఇస్తే ప్రజలకు ఏం అవసరాలున్నాయో వాటికి అనుగుణంగా పాలన చేయకుండా తెలంగాణ అస్థిత్వ చిహ్నాలను మారుస్తామంటే ఎలా? ఈ నిర్ణయాన్ని తెలంగాణ ప్రజలు, మేధావులు, కవులు, రచయితలు ఎవరూ స్వాగతించరు. రాజముద్రలో ఉన్న చిహ్నాలను కొనసాగించాలి.

**-కోదారి శ్రీనివాస్, తెలంగాణ ఉద్యమ కవి, గాయకుడు,**

### కాకతీయ కళాతోరణాన్ని ఉంచాల్సిందే



కాకతీయుల సుపరిపాలనకు ఓరుగల్లు కీర్తిని చాటేది కళాతోరణం. ఎంతో చారిత్రక గుర్తింపు ఉన్న చిహ్నాన్ని రాజముద్ర నుంచి తొలగించాలని ప్రభుత్వం చూస్తున్నది. మరోసారి పునరాలోచించి కాకతీయ కళా తోరణాన్ని యథావిధిగా ఉంచాలి. కళాతోరణం తొలగింపును ప్రతి ఓరుగల్లు బిడ్డ వ్యతిరేకించాలి. ఈ మేరకు సీఎంవో కార్యాలయానికి మెయిల్ కూడా పెట్టాం.

**- కామిడి సతీశ్‌రెడ్డి, తెలంగాణ సామాజిక రచయితల సంఘం అధ్యక్షుడు**

## లెటర్ ఐడీ మార్చినట్టు చిహ్నం మార్చుతారా?

**తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి**



కవాడిగూడ, మే 31: లెటర్ ఐడీ మార్చినట్టు అధికార చిహ్నాన్ని మార్చడం సరికాదని, ఆ నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ వారసత్వ సంపద, సంస్కృతికి గుర్తులుగా ఉన్న చార్మినార్, కాకతీయ కళాతోరణాన్ని రాజముద్ర నుంచి తొలగించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. చార్మినార్‌ను తొలగించడమంటే ప్రతి హైదరాబాదీని అవమానించినట్టే, ప్రతి ఒక్కరిని అగౌరవపరిచినట్టేనని పేర్కొన్నారు. శుక్రవారం కవాడిగూడలోని అడ్వకేట్ జేఏసీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రాజముద్రలోని చిహ్నాలను ఇప్పుడు తొలగించాల్సిన అవసరమేమొచ్చిందని ప్రశ్నించారు. ఒకవేళ మార్చాలన్న యోచన ఉంటే నెల ముందు ప్రజాభిప్రాయాన్ని సేకరించి, అందుకు అనుగుణంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

## లోకం పోకడ




ఫలితాల్లో తేడాలొస్తే మీరు కూడా వేరే పార్టీలోకి బదిలీ అవుతారా సార్?

## ఎండా కాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 47.2°c | 28.0°c |
| నల్లగొండ | 46.8°c | 33.6°c |
| ఖమ్మం | 40.0°c | 29.0°c |
| మెదక్ | 43.8°c | 28.0°c |
| రంగారెడ్డి | 42.4°c | 26.3°c |
| కరీంనగర్ | 42.0°c | 32.0°c |
| వరంగల్ | 42.0°c | 30.0°c |
| నిజామాబాద్ | 42.0°c | 29.5°c |
| మహబూబ్‌నగర్ | 39.5°c | 28.0°c |
| హైదరాబాద్ | 41.0°c | 29.7°c |

## నేడు బీఆర్‌ఎస్ క్యాండిల్ ర్యాలీ

**గన్‌పార్క్ నుంచి అమరజ్యోతి వరకు నిర్వహణ**

హైదరాబాద్, మే 21 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల నిర్వహించేందుకు గులాబీ శ్రేణులు సిద్ధమయ్యాయి. శనివారం నుంచి మూడు రోజులపాటు వైభవంగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తామని పార్టీ అధినేత కేసీఆర్ ఇప్పటికే ప్రకటించారు. ఇందులో భాగంగా తెలంగాణ ఉద్యమకారులు, ప్రజలతో శనివారం హైదరాబాద్ గన్‌పార్క్‌లోని తెలంగాణ అమరవీరుల స్థూపం నుంచి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయం ఎదురుగా ఉన్న అమర జ్యోతి వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించనున్నారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు, జంట నగరాల పార్టీ శ్రేణులతో భారీ ఎత్తున ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సన్నాహాలు పూర్తయ్యాయి. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో జరిగే కార్యక్రమానికి కేసీఆర్ అధ్యక్షత వహించనున్నారు. తెలంగాణ ఉద్యమ ప్రస్థానంతోపాటు గత పదేండ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం సాధించిన ప్రగతి, ప్రజల జీవితాల్లో వచ్చిన మార్పులు తదితర అంశాలపై ఆయన ప్రసంగించనున్నారు. అనంతరం బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు హైదరాబాద్‌లోని పలు దవాఖానలు, అనాథ శరణాలయాల్లోని వారికి మిఠాయిలు, పండ్లు పంపిణీ చేయనున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇప్పటికే పార్టీ జిల్లా అధ్యక్షులకు సూచించారు.

## అసలైన ఉద్యమకారులను గుర్తించరా?

- **కమిటీలో తెలంగాణ వ్యతిరేకులే ఉన్నారు**
- **ఎమ్మెల్యేను నిలదీసిన ఉద్యమకారులు రాజమౌళి, క్రాంతికుమార్**



వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని నిలదీస్తున్న బీసీ రాష్ట్ర నేత ఏదునూరి రాజమౌళి

హనుమకొండ చౌరస్తా, మే 31: తాత్కాలిక ఉద్యమకారుల ఎంపిక కమిటీలో అసలైన ఉద్యమకారులను గుర్తించలేదని, అంతా తెలంగాణ వ్యతిరేకులే ఉన్నారని బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు ఏదునూరి రాజమౌళి, ఎమ్మెల్సీ అభ్యర్థి తాటిశెట్టి క్రాంతికుమార్ వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని నిలదీశారు. శుక్రవారం హనుమకొండ నయీంనగర్‌లో జరిగిన సమావేశంలో వారు ఎమ్మెల్యేను ప్రశ్నించారు. మైకులు పట్టుకుని వేదికలపై మాట్లాడేవారే ఉన్నారని, నిజమైన ఉద్యమకారులను ఎలా గుర్తిస్తారని వారు ప్రశ్నించారు. ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ తెలంగాణ ఉద్యమంలో లేరని, పిలిస్తే వచ్చి మాట్లాడేవాడని,అలాంటి వ్యక్తితో కమిటీ వేసి ఉద్యమకారులను గుర్తిస్తారా? నిలదీశా రు. స్పందించిన ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మీడియాలో కనిపించాలని ఇలా చేయడం సరి కాదన్నారు. ఉద్యమకారులను నిర్లక్ష్యం చేయకుండా కమిటీ గుర్తిస్తుందని, ఒకవేళ పొరపాటున గుర్తించలేకపోతే ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో పేర్లు నమోదు చేసుకోవచ్చని సూచించారు.

## చిహ్నం జోలికి వెళ్లకపోతేనే బెటర్

- **కళలకు ప్రాంతీయ భేదాలు, హద్దులు గీయడం తగదు**
- **సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ వ్యాఖ్య**

హైదరాబాద్, మే 31 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర చిహ్నం మార్చకపోవడమే మంచిదని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం రాజముద్ర జోలికి వెళ్లకుండా.. రాష్ట్ర అభివృద్ధిపై దృష్టిపెట్టాలని సూచించారు. రాజకీయ విభేదాలు ఉండొచ్చు కానీ కక్షలు ఉండకూడదని సూచించారు. కేసీఆర్ చేసిన ప్రతిదాన్ని రివర్స్ చేస్తే రేవంత్‌రెడ్డి ఆయన నెత్తిన ఆయనే చెత్త వేసుకున్నట్టు అవుతుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం నారాయణ మాట్లాడుతూ.. జయ జయహే తెలంగాణను రాష్ట్ర గీతంగా రూపొందించడం అభినందనీయమని పేర్కొన్నారు. రాష్ట్ర గీతం కంపోజ్ చేయానికి కీరవాణిని మ్యూజిక్ డైరెక్టర్‌గా పెడితే తప్పేంటని ప్రశ్నించారు. కళలకు ప్రాంతీయ భేదాలు ఉండవని, హద్దులు గీయడం సరికాదని చెప్పారు. తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి కూడా వైఎస్ జగన్‌ను ఫాలో అవుతున్నారని పేర్కొన్నారు.

## 3 నుంచి 'మేడిగడ్డ' అధ్యయనం

- **రాష్ట్రానికి రానున్న నిపుణుల బృందాలు**
- **ఎన్డీఎస్‌ఏ సిఫారసులపై స్టడీ**
- **మూడు బరాజ్‌లకు 4కోట్లు అవసరం**
- **సీఎస్‌డబ్ల్యూపీఆర్‌ఎస్, సీఎస్‌ఎంఆర్‌ఎస్ అంచనాలు**

*హైదరాబాద్, మే31 (నమస్తే తెలంగాణ): మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లపై అధ్యయనం కోసం ఈ నెల 3 (సోమవారం)న నిపుణుల బృందాలు రానున్నాయి. మేడిగడ్డ అధ్యయనం కోసం రూ.2కోట్లు కావాలని నీటిపారుదల శాఖకు సీఎస్‌ఎంఆర్‌ఎస్ (సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్) ప్రతిపాదనలు పంపింది. అన్నారం, సుందిళ్ల బరాజ్‌లో సీపేజీలు, పనితీరు పరిశీలన కోసం ఒక్కోదానికి రూ.కోటి మేర ఖర్చవుతుందని సీడబ్ల్యూపీఆర్‌ఎస్ (సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్) అంచనా వేసింది. బరాజ్‌ల పరిస్థితిపై పరిశోధనలు, పరీక్షలను సీఎస్‌ఎంఆర్‌ఎస్, సీడబ్ల్యూపీఆర్‌ఎస్, ఎన్జీఆర్‌ఐ హైదరాబాద్ వంటి సంస్థలతో చేయించాలని ఎన్డీఎస్‌ఏ సూచించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం ఆయా సంస్థలను సంప్రదించింది. ఇప్పటికే సీడబ్ల్యూపీఆర్‌ఎస్ నిపుణుల బృందం బరాజ్‌లను పరిశీలించి, నీటిపారుదల అధికారులతో భేటీ అయి చేపట్టాల్సిన పనులపై చర్చించింది. పనులకు ఎంత ఖర్చవుతుందో తెలుపుతూ రెండు సంస్థలు నీటిపారుదల శాఖకు ప్రతిపాదనలు పంపాయి. రెండు సంస్థల నిపుణులు 3 నుంచి క్షేత్రస్థాయిలో అధ్యయనాన్ని ప్రారంభించనున్నట్టు అధికారవర్గాలు వెల్లడించాయి.*

### 12నాటికి పనులు పూర్తి!

*ఈనెల 10 లేదా 12 నాటికి తాత్కాలిక పనులను పూర్తిచేయాలనే లక్ష్యంతో అధికారులు ముందుకు సాగుతున్నారు. 20, 21 రెండు గేట్లలో ఇప్పటికే 20వ గేట్‌ను తొలగించారు. 21వ గేట్‌ను ఎత్తే అవకాశముందని భావిస్తున్నారు. 7వ బ్లాక్ కింద బొయ్యారాన్ని గ్రౌటింగ్ చేస్తున్నారు. తీవ్ర ఎండల కారణంగా పనిప్రదేశంలో ఇంజినీర్లు, కార్మికులకు సౌకర్యాలు కల్పించారు. ఎమర్జెన్సీ కోసం అంబులెన్స్‌ను కూడా అందుబాటులో ఉంచారు.*


### అధ్యయన అంశాలివే..

- మేడిగడ్డ బరాజ్ మొత్తం, 7వ బ్లాక్ ఎగువ, దిగువన సెకెంట్ పైల్స్ పరిస్థితి, పారామెట్రిక్ జాయింట్‌పై అంచనా
- రుతుపవనాల ప్రారంభానికి ముందే జియోఫిజికల్, జియోటెక్నికల్ పరీక్షలు నిర్వహించాలి.
- మేడిగడ్డ బరాజ్ మధ్య రేఖ నుంచి 5వేల మీటర్ల దూరం వరకు నది క్రాస్ సెక్షన్ల అధ్యయనం
- నీటి ప్రవాహ గేజ్‌ల పరిశీలన
- అధిక రిజల్యూషన్ కెమెరా డ్రోన్‌తో బ్యారేజీ ఉపరితల పగుళ్ల మ్యాపింగ్
- జియోఫిజికల్ పరిశోధనల ఫలితాలను బోర్‌హోల్ ఇన్వెస్టిగేషన్ల ద్వారా ధ్రువీకరణ
- రుతుపవనాల తర్వాత అప్‌స్ట్రీమ్, డౌన్‌స్ట్రీమ్‌లోని సెకెంట్ పైల్స్, కటాఫ్‌ల పారామెట్రిక్ జాయింట్లపై భౌగోళిక పరిశోధన
- బరాజ్‌ల పునాది పటిష్ఠత అంచనా
- కాంక్రీట్ నిర్మాణాలు, నాణ్యత, సమగ్రతను అంచనా వేసే పరిశోధనలు
- అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల లీకేజీల గ్రౌటింగ్ సమగ్రతను పరీక్షించాలి.

# 5 రోజులు వానలే వానలు

- **పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో తేలికపాటి నుంచి భారీ వర్షాలు**
- **2న పలు జిల్లాల్లో వర్షాలు.. ఎల్లో అలర్ట్ జారీ**
- **జూన్ 5-11 మధ్య నైరుతి రుతుపవనాలు తెలంగాణ రాష్ట్రంలోకి విస్తరించే అవకాశం: హైదరాబాద్ వాతావరణ కేంద్రం**

### 150 ఏండ్లుగా రుతుపవనాల సమయంలో మార్పు



*ఐఎండీ లెక్కల ప్రకారం.. కేరళలో రుతుపవనాలు ప్రవేశించే సమయం గత 150 సంవత్సరాలుగా మారుతూనే ఉన్నది. మొదటిసారి 1918లో మే11న ప్రవేశించాయి. అత్యంత ఆలస్యంగా 1972 జూన్ 18న ప్రవేశించాయి. నిరుడు జూన్ 8న, 2022లో మే 29న, 2021లో జూన్ 3న, 2020లో జూన్1న నైరుతి రుతుపవనాలు కేరళ తీరానికి తాకాయి. ఈసారి మే 31న రుతుపవనాలు కేరళను తాకుతాయని ఐఎండీ అంచనా వేసింది. కానీ, ఒకరోజు ముందే నైరుతి రుతుపవనాలు దేశంలోకి ప్రవేశించాయి.*

హైదరాబాద్, మే 31 (నమసే తెలంగాణ): కొన్నిరోజులుగా ఎండవేడిమి, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న తెలంగాణ ప్రజలకు.. భారత వాతావరణశాఖ (ఐఎండీ) శుభవార్త చెప్పింది. తెలంగాణలోని పలు జిల్లాల్లో వచ్చే ఐదురోజులు తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. శనివారం నల్లగొండ, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ, గద్వాల జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. వానలు కురిసే సమయంలో ఉరుములు, మెరుపులతోపాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆదివారం వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, రంగారెడ్డి, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అంచనావేశారు.

### అనుకున్న సమయం కన్నా ముందే..

నైరుతి రుతుపవనాలు దేశంలోని పలు ప్రాంతాల్లోకి అనుకున్న తేదీ కన్నా ముందే ప్రవేశించే అవకాశం ఉన్నట్టు భారత వాతావరణశాఖ అంచనా వేసింది. ఇప్పటికే త్రిపుర, మేఘాలయ, అసోం, బెంగాల్, సిక్కింలోకి ప్రవేశించాయని తెలిపింది. లక్షద్వీప్, కేరళ, కర్ణాటక, తమిళనాడు సహా పలు ప్రాంతాల్లోకి ముందే ప్రవేశించే పరిస్థితులు కనిపిస్తున్నాయని వెల్లడించింది. రుతుపవనాల ప్రభావంతో కేరళలోని పలు జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. తమిళనాడులోని పలు ప్రాంతాల్లో చిరుజల్లులు పడుతున్నాయి. మరో రెండుమూడు రోజుల్లో రుతుపవనాలు తెలుగు రాష్ట్రాలకు విస్తరించనున్నట్టు వాతావరణశాఖ తెలిపింది. జూన్ 5 నుంచి 11 తేదీల మధ్య తెలంగాణలోకి విస్తరించే అవకాశం ఉన్నట్టు పేర్కొన్నది. నైరుతి రుతుపవనాల ఆగమనంతో వానకాలం సీజన్ ప్రారంభమైనట్టేనని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. ఈ ఏడాది లానినా అనుకూల పరిస్థితులు, భూమధ్యరేఖ వద్ద పసిఫిక్ మహాసముద్రం చల్లబడటం వంటి కారణాలతో సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

### రేమాల్ తుఫాను వల్లే!

ఈశాన్య భారతంలోకి కూడా పలు ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరించాయని ఐఎండీ తెలిపింది. సాధారణంగా జూన్ 1వ తేదీన నైరుతి రుతుపవనాలు కేరళలోకి ప్రవేశిస్తాయి. ఆ తర్వాత జూన్ 5 నాటికి అరుణాచల్‌ప్రదేశ్, త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ, మిజోరం, మణిపూర్, అసోం రాష్ట్రాలకు చేరుకుంటాయి. ఈసారి రుతుపవనాల ఆగమనం సమయంలోనే బంగాళాఖాతంలో రేమాల్ తుఫాన్ ఏర్పడింది. తుఫాన్ రుతుపవనాల గమనాన్ని బలంగా లాగిందని, అందుకే నిర్ణీత సమయానికి ముందుగానే అవి ఈశాన్య రాష్ట్రాలకు చేరుకున్నాయని వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారు. 2017లో కూడా ఇలాంటి ఘటనే జరిగింది. అప్పుడు కూడా రుతుపవనాల ఆగమనానికి కొద్ది రోజుల ముందు బంగాళాఖాతంలో మోరా తుఫాను ఏర్పడింది. ఒకే సమయంలో కేరళ, ఈశాన్య రాష్ట్రాలను నైరుతి రుతుపవనాలు తాకాయి.



ఖమ్మ జిల్లా తిరుమలాయపాలెం మండలం కొక్కిరేణిలో మంత్రి పొంగులేటి పాల్గొన్న సభలో కన్నీటితో తన ఆవేదనను వ్యక్తపరుస్తున్న బోండ వెంకటలక్ష్మి

## ఇండ్లు లేవు.. పించన్లు లేవు

- **ఓట్లేసి గెలిపిస్తే గిట్లనే చేస్తర సారూ..**
- **మంత్రి పొంగులేటి సభలో మహిళల ఆవేదన**

తిరుమలాయపాలెం, మే 31 : 'మేము ఓట్లు వేసి మిమ్మల్ని గెలిపించాం. మాకు ఇండ్లు, రేషన్ కార్డులు, పించన్లు లేవు. వాటిని మంజూరు చేయాలని కోరితే కూడా పట్టించుకంట లేరు.. ఇదేంది సారూ' అని పలువురు మహిళలు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం కొక్కిరేణిలో గ్రామంలో మంత్రి పొంగులేటి పర్యటన సందర్భంగా జరిగిన సభలో బోండ వెంకటలక్ష్మి అనే మహిళ మాట్లాడుతూ.. తన భర్త పేరిట రెండున్నర ఎకరాల భూమి ఉన్నా.. రైతుబంధు, రైతుబీమా రాలేదని ఆవేదన వ్యక్తం చేసింది. గుర్తుతెలియని వ్యక్తులు తన భర్తను హత్య చేసినా ఎవరూ పట్టించుకోలేదని కంటతడి పెట్టింది. స్పందించిన మంత్రి పొంగులేటి.. సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కాగా పలువురు మహిళలు సైతం మాట్లాడుతూ తమకు సంక్షేమ పథకాలు అందడం లేదని ఆవేదన వెళ్లగక్కారు. కాగా అంతకుముందు మంత్రి పొంగులేటి కారు దిగగానే జడ్పీటీసీ సభ్యుడు బెల్లం శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకుడు చావా శివరామకృష్ణ వర్గీయులు ఆధిపత్యం కోసం పోటాపోటీగా నినాదాలు చేశారు. సభలో తమ తమ వర్గాల నాయకులు మాట్లాడుతున్న క్రమంలో బెల్లం శీనన్న జిందాబాద్, శివన్న జిందాబాద్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. కాగా ఎవరికి వారు సభలు ఏర్పాటు చేయగా మంత్రి రెండు చోట్లకు వెళ్లి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

## నేషనల్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్, మే31 (నమస్తే తెలంగాణ): నేషనల్ అవార్డులకు అర్హులైన ఉన్నత విద్యను అందించే వివిధ కళాశాలల్లో పనిచేసే అధ్యాపకుల నుంచి యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ (యూజీసీ) దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది. ఈనెల 20లోగా రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్‌లో నేషనల్ అవార్డ్ టు టీచర్స్ 2024కు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. రెగ్యులర్ ఫ్యాకల్టీ అయి ఉండి, ఐదేళ్లకు తక్కువ కాకుండా డిగ్రీ, పీజీస్థాయిలో ఫుల్‌టైం బోధన అనుభవం కలిగి ఉండి, 55ఏళ్ల వయస్సు మించని వారు అర్హులని వెల్లడించింది.